సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



ఆశలు 'సమాధి'

బంక శ్రీనివాస్‌రెడ్డి నెల్లూరు జిల్లా నుంచి సుమారు పాతికేళ్ల క్రితం ఉపాధి కోసం కోరుట్లకు వలస వచ్చారు. భార్య మాధవితో కలిసి చిన్నచితకా పనులు చేశారు. 8లో



మెలకువలతో బోధన చేయాలి

జ్యోతినగర్: విద్యార్థులకు మెలకువలతో విద్యాబోధన చేయాలని సెక్టోరియల్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్నతిశిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

9న లోక్‌అదాలత్



మాట్లాడుతున్న ప్రధానన్యాయమూర్తి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ఈనెల 9న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో మాట్లాడారు. బీమా కంపెనీ, చెక్‌బౌన్స్‌కేసులు, ప్రమాదాలు, విద్యుత్‌పరమైన కేసుల్లో ఇరువర్గాల వారు రాజీ పడొచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డీసీపీ వైభవ్‌గైక్వాడ్, బార్‌అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు భాస్కర్, రెడ్డి శంకర్, దోనేటి కిష్టయ్య, ఉప్పు రాజన్న, కుమారస్వామి, విజయరం గారెడ్డి, ఏసీపీ మహేశ్, శ్రీనివాసరావు తదితరులున్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి



పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ముత్తారం: ధరణిలో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. మండలంలో ధరణి పెండింగ్ దరఖాస్తులు, భూ సమస్యలు, ఓటర్ నమోదుపై తహసీల్దార్ రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. కేశనపల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. ఓటరు నమోదు సక్రమంగా చేయాలని బీఎల్‌వో సరోజనకు సూచించారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు రాజిరెడ్డి, శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్ ఉన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాజు



ఓదెల: మండలంలోని కొలనూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న తోట రాజు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడటం.. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం.. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దటం.. పాఠశాలలో వారి ఉపస్థితిని పెంచడంలో రాజు ముందు నిలిచారు. ఈనెల 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం రోజున హైదరాబాద్‌లో విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన చేతులమీదుగా ఉత్తమ అవార్డును అందుకోనున్నారు. రాజును ఎంఈవో ఆరెపల్లి రాజన్న, కొలనూర్ సర్పంచ్ సామ మణెమ్మ, ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ సుమన్ ఉన్నారు.

నేషనల్ న్యూట్రిషన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం నేషనల్ న్యూట్రిషన్ వీక్ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దుర్దనపర్వీన్, జిల్లా సంక్షేమాధికారి రవూఫ్ ఖాన్ పాల్గొని పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ పేర్లను జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆదివారం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు నమోదు చేస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ రాజు ,వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, అధ్యాపకులు రాంచందర్, నిర్మల, అశ్విని పాల్గొన్నారు.

'ఖని'లో మహిళకు డెంగీ

కోల్‌సిటీ: కార్పొరేషన్ ఆరో డివిజన్ సప్తగిరికాలనీకి చెందిన ఓ మహిళకు శనివారం డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. జ్వరం తగ్గకపోవడంతో పరీక్షలు చేయించుకోగా డెంగీగా తేలింది. ఆమెకు జీజీహెచ్‌లోని చికిత్స అందిస్తున్నారు. ఆమె నివాస ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరగడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

వామ్మో వ్యాధులు..!



- ఈ చిత్రంలోని యువకుడు తిమ్మిశెట్టి శ్యాం. బసంత్‌నగర్‌లోని రాజీవ్ నగర్‌లో నివాసం. డిగ్రీ చదువుతున్నాడు. నాలుగు రోజులుగా చలి జ్వరం రావడంతో జీజీహెచ్ ఆస్పత్రికి వచ్చాడు. రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు అడ్మిట్ చేసుకుని వైద్యం అందిస్తున్నారు.



రోగులతో కిటకిటలాడుతున్న జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి

- పెరుగుతున్న జ్వరపీడితులు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిట
- జిల్లాకేంద్ర ఆసుపత్రిలో రోజుకు 400కుపైగా ఓపీ
- డెంగీ కేసులు నమోదువుతున్నా చర్యలు శూన్యం



జీజీహెచ్‌లో రోగుల తాకిడి

- సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి రోజు ఓపీ 250కి పైగా వస్తున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. 66మంది విషజ్వరాలతో చికిత్స పొందుతున్నట్లు తెలుపుతున్నారు.

పెద్దపల్లిరూరల్/కోల్‌సిటీ/మంథని/సుల్తానాబాద్: జిల్లాలో రోజురోజుకూ జ్వరపీడితులు పెరుగుతున్నారు. సాధారణ, టైఫాయిడ్ తోపాటు వాంతులు, విరోచనాలతో ఆసుపత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. జిల్లాకేంద్రంతోపాటు సుల్తానాబాద్, మంథని, గోదావరిఖని ఆసుపత్రులు, గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా రోగులతో నిండి పోయాయి. జిల్లాకేంద్ర ఆసుపత్రికి 400పైచిలుకు ఔట్‌పేషెంట్లు వస్తుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రైవేట్ ఆసుత్రుల్లో వైద్యం పొందుతున్న వారూ అధికంగా ఉన్నారు.

ఓపీ జనరల్‌కు ఒక్కడే వైద్యుడు

జిల్లాకేంద్ర ఆసుపత్రికి వందల సంఖ్యలో రోగులు వస్తుండగా.. ఓపీ జనరల్ వైద్య పరీక్షలు చేసే బాధ్యతలను కేవలం ఒకే వైద్యుడికి అప్పగించడం గమనార్హం. రోగులు క్యూలైన్‌లో ఉండలేక ఆవేదన వెలిబుచ్చుతున్నారు. గోదావరిఖనిలోని జీజీహెచ్‌లో 98మందికి డెంగీ పరీక్షలు నిర్వహించగా.. 29 మందికి నిర్ధారణ అయినట్లు అధికారులు వెల్లడించారు. వాతావరణంలో అనూహ్యంగా చోటుచేసుకుంటున్న మార్పులతో ఇంట్లో కనీసం ఒకరు లేదా ఇద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతున్నారు.

- జ్వరాలతో చికిత్సకోసం జీజీహెచ్‌కు వస్తున్న పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. దీనికి అనుగుణంగా వైద్యాధికారులు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- మంథని సామాజిక వైద్యశాలకు చుట్టుపక్కల గ్రామాలతోపాటు ముత్తారం, రామగిరి, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలాల నుంచి రోగులు వస్తున్నారు. పది రోజులుగా రోజుకు 200 నుంచి 270 మందికి వరకు ఓపీ నమోదవుతోంది. ఒళ్లు, నడుంనొప్పి, వాంతులు, విరోచనాలతో బాధపడుతుండగా.. 15 నుంచి 20 వరకు అడ్మిట్ పొందుతున్నారు. వైద్యసిబ్బంది సరిగా పట్టించుకోవడం లేదని, దురుసుగా ప్రవర్తిస్తున్నారని రోగులు 'సాక్షి'కి తెలిపారు.

రెండు రోజుల క్రితం వచ్చా



జ్వరంతో రెండు రోజుల క్రితం వచ్చిన. ఇక్కడే ఉండుమన్నరు. రాత్రిపూట జ్వరం వస్తంది. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నా.. పిలిస్తేనే వచ్చి చికిత్స చేస్తున్నరు.

– ఓదమ్మ, కనగర్తి

అందుబాటులో మందులు



ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయి. రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నాం. సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించాం. టైఫాయిడ్, డెంగీ, మలేరియా వంటి రోగులకు చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ రమాదేవి, డీడీవో, సుల్తానాబాద్

జ్వరం, విరోచనాలు



జ్వరంతోపాటు విరోచనాలు అవుతున్నాయి. జిల్లాకేంద్ర ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నా. ఇంకా నీరసంగానే ఉంది. జ్వరం ఎప్పుడు తగ్గుతుందో ఏమో..

– సాహిత్య, పెద్దపల్లి

జ్వరంతో వచ్చి చేరా..



నాలుగు రోజుల క్రితం జ్వరంతో జిల్లాకేంద్ర ఆసుపత్రిలో చేరా. పరీక్షలు చేసిన వైద్యుల టైఫాయిడ్ అన్నారు. మందులు ఇస్తున్నరు. మా వీధిలో దోమలు పెరగడం వల్లే జ్వరంబారిన పడ్డా. – షకీల్‌ఖాన్, అమర్‌నగర్, పెద్దపల్లి

సేవల్లో నిర్లక్ష్యం



జ్వరం, నీరసంగా ఉందని ఆసుపత్రికి వచ్చా. పరీక్షల కోసం రక్తం సేకరించారు. మూడురోజులు గడిచినా రిపోర్టులు ఇస్తలేరు. ఏమైందో చెబుతలేరు. సిబ్బంది రోగుల వైపు చూడడం లేదు. – ఎక్కంటి లక్ష్మి, గాంధీనగర్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ తదితరులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, జాయింట్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీలతో కలిసి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. శాసన సభ సాధారణ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై చర్చించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పోలీసు అధికారులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పోలింగ్‌కేంద్రాల వారీగా జనాభా, ఓటర్ల నిష్పత్తి, లింగనిష్పత్తి తదితర అంశాలను వివరంగా ఉండేలా చూడాలన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లకు గుర్తింపుకార్డులు జారీ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీలు మధుమోహన్, హనుమనాయక్, ఏఓ శ్రీనివాస్, ఎలక్షన్ డిటి ప్రవీణ్ తదితరులున్నారు.

మహానేత వైఎస్సార్



పెద్దపల్లిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, తదితరులు



గోదావరిఖనిలో కాంగ్రెస్‌నాయకుల నివాళి



జూలపల్లిలో...

- నివాళులర్పించిన నాయకులు
- ఆయన సంక్షేమాన్ని గుర్తు చేసుకున్న వైనం

గోదావరిఖని: ప్రజా సంక్షేమం కోసం కృషిచేసిన గొప్పనేత వైఎస్.రాజశేఖర రెడ్డి అని వక్తలు కొనియాడారు. గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కౌటం సతీశ్, నాయకులు మహంకాళి స్వామి, ఎండీ.ముస్తఫా, పెద్దెల్లి తేజస్విని, ప్రకాష్, నగునూరి సుమలత, చుక్కల శ్రీనివాస్, నగునూరి రాజు, బొమ్మక రాజేశ్, తాళ్లపెల్లి యుగేందర్, పెండ్యాల మహేష్, గట్ల రమేష్ తదితరులు నివాళి అర్పించారు.

జూలపల్లిలో


జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో వైఎస్సార్ వర్ధంతిని వైసీపీ నాయకులు కొమ్మ రాజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు గుండెటి లచ్చయ్య, దాడి రాజయ్య, మొగురం భూమయ్య, తిరుపతి, మాంకాలి వెంకటి, లచ్చయ్య, కన్నం మధునయ్య తదిరులు ఉన్నారు.

వైఎస్సార్ పాలన మరువలేనిది: విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: వైఎస్సార్ పాలన మరవలేనిదని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో వర్ధంతి సభ ఏర్పాటు చేశారు. విజయరమణారావు పాల్గొని మాట్లాడారు. 108తో పేదలకు వైద్యం అందించారని, ఫీజురీయింబర్స్‌మెంట్‌తో అందరి గుండెల్లో చిరస్మరణీయుడిగా ఉన్నారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు మల్లయ్య, సుభాష్‌రావు, సంపత్, నాయకులు సారయ్య, మస్రత్, సర్వర్‌పాషా, తుల మనోహర్‌రావు, బొడ్డుపల్లి శ్రీను, తిరుపతి, శ్రవణ్, సురేశ్, మసూద్, మెహరాజ్, హకీం తదితరులున్నారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

- జిల్లాకు 2,463 టీచర్ పోస్టులు మంజూరు
- ప్రస్తుతం 2,205 మంది విధులు
- ఖాళీగా ఉన్న పోస్టులు 258



సుల్తానాబాద్: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఏడాది జనవరి 25 నుంచే చేపట్టాల్సి ఉండగా.. కోర్టు స్టే విధించడంతో నిలిచిపోయింది. ఇటీవల హైకోర్టు పచ్చజెండా ఊపడంతో బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ తాజాగా విడుదల చేసింది. బదిలీలతోపాటు అర్హులైన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు దక్కనున్నాయి. జిల్లాకు టీచర్ మంజూరు పోస్టులు 2463 కాగా.. ప్రస్తుతం పనిచేస్తున్న వారు 2205 మంది. జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు 258. జిల్లావ్యాప్తంగా గ్రేడ్–2 హెచ్‌ఎంలు 37, స్కూల్ అసిస్టెంట్ గణితం 20, భౌతిక శాస్త్రం 7, జీవశాస్త్రం 20, సాంఘిక శాస్త్ర 49, ఆంగ్లం 8, తెలుగు 15, హిందీ 15, ఉర్దూ 2, పీడీలు 5, భాషా పండితులు 5, తెలుగు 3, హిందీ 2, ఏకోపాధ్యాయులు 45, పీఈటీ ఒకటి, ఎస్జీటీలు 25 పోస్టులు ఉన్నట్లు జిల్లా విద్యాధికారులు ప్రకటించారు

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి గతంలో మాదిరిగానే ఈసారి కూడా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల మూడో తేదీ నుంచి 5 వరకు గడువు విధించారు. ఈనెల 6, 7 తేదీన విచారణ చేపట్టనున్నారు. 8, 9 తేదీల్లో ఆర్జేడీ విచారణ చేపట్టనున్నారు. జిల్లాలో 2463 మంది టీచర్లు పని చేస్తున్నారు. వీరిలో ఈ ఏడాది జనవరి నాటికి 2,205 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను బదిలీకి అర్హులుగా గుర్తించారు. ప్రధానోపాధ్యాయులు ఐదేళ్లు, ఉపాధ్యాయులు ఎనిమిదేళ్ల సర్వీసు ఒకేచోట పూర్తి చేస్తే తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. రెండేళ్లు ఒకే చోట పని చేసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. సంబంధిత పత్రాలను జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

ఖాళీల ఆధారంగా టీఆర్టీ..

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు 2018లో నిర్వహించారు. ఆ తరువాత ఈ ఏడాది జనవరిలో బదిలీలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించారు. కొన్ని సంఘాలు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఉపాధ్యాయులు నిరుత్సాహపడ్డారు. హైకోర్టు ఉత్తర్వులకు లోబడి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. పదోన్నతుల ప్రక్రియ పూర్తయిన తరువాత పాఠశాలల్లో ఖాళీలు మరిన్ని పెరిగే ఆకాశం ఉంటుంది. దీని ఆధారంగా టీఆర్టీ నిర్వహించి ఖాళీలను భర్తీ చేసే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు – మాధవి, డీఈవో

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తాం. మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. అర్హులైన వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుంది.

ప్రక్రియ ఇలా..

- ఈనెల 12, 13 తేదీల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంల బదిలీలకు వెబ్ ఆప్షన్లు
- 15న గ్రేడ్–2 ప్రధాన ఉపాధ్యాయుల బదిలీలు
- 17 నుంచి 19 వరకు స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంగా పదోన్నతులు
- 20, 21 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు వెబ్ ఆప్షన్లు
- 23, 24న స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు
- 26 నుంచి 28న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- 29 నుంచి అక్టోబరు ఒకటి వరకు ఎస్జీటీల బదిలీలకు వెబ్ ఆప్షన్లు అక్టోబరు 3న ఎస్జీటీల బదిలీ
- ఐదో తేదీ నుంచి 19 వరకు అప్పీళ్లకు అవకాశం

వెంటనే అమలు చేయాలి



హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ఉపాధ్యాయులుగా స్వాగతిస్తున్నాం. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టాలి. బదిలీల కటాఫ్ తేదీ ఆగస్టు 31వరకు తీసుకోవాలి. మిగిలిన ఖాళీల కోసం కొత్త నియామకాలు చేపట్టాలి.

– అశోక్ రెడ్డి, డీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు, సుల్తానాబాద్

ఎన్నికల తేదీ రాకముందే జరగాలి



అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రాకముందే బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలి. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి. ఎన్నికల కోడ్ రాకముందే పూర్తి చేయాలి.

– సారయ్య, టీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సుల్తానాబాద్

క్లుప్తంగా

యువ ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి



సూచనలు ఇస్తున్న అడిషనల్ కలెక్టర్

జ్యోతినగర్: యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టిసారించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం సందర్శించారు. ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. అనంతరం బూత్ స్థాయి అధికారులకు బీఎల్‌వో కిట్లను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, పలువురు బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో నిర్మిస్తున్న హెల్త్ సెంటర్ పనులను అరుణశ్రీ పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. సర్పంచ్ లావణ్య, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, ఏఈ అనిల్ కుమార్ ఉన్నారు.

మల్కాపూర్‌లో నా భూమి నాదేశం

జ్యోతినగర్: ఆజాదికా అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు శనివారం నా భూమి నాదేశం నిర్వహించారు. కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల స్వరూప ఆధ్వర్యంలో అర్చకులు సత్యనారాయణ శర్మ పూజలు చేసి మట్టిని సేకరించారు. పార్టీ మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ పిడుగు కృష్ణ మాట్లాడారు. ఢిల్లీలో అమృత వాటిక నిర్మాణానికి దేశంలో ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారని, అందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈదునూరి చిరంజీవి, వాసు, మహేష్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, కిషోర్, సంజీవ్, తార, శిరీష, జ్యోతి పాల్గొన్నారు.


క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ క్రీడా పాఠశాల హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో 2023–24 విద్యాసంవత్సరంలో 4వ, 5వ తరగతుల ప్రవేశాలకు ఇటీవల ఎంపికపోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లానుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. నాలుగో తరగతికి ఎస్.చైతన్య (జగిత్యాల), పి.అలకనంద (జగిత్యాల), కె.అమూల్య, డి.శ్రీవర్షిణి (కరీంనగర్), ఏ.అనన్య (పెద్దపల్లి), బి.హర్షిత, ఈ.శ్రీనిజ(రాజన్న సిరిసిల్ల) ఎంపికయ్యారు. ఐదో తరగతికి జి.శ్రీకేష్, పి.సాహిత్ పటేల్ (జగిత్యాల), ఎస్.సిద్ధార్థ, జె.హరిహరణ్‌యాదవ్ (పెద్దపల్లి), బి.వినమ్రత్ సింహ(రాజన్న సిరిసిల్ల), ఆర్.కావ్యశ్రీ, ఎం.సాహితి, పి.సామిత, ఎ.సంస్కృతి (జగిత్యాల), ఏ.అక్షిత(కరీంనగర్), టి.అక్షిత, బి.సహస్ర(రాజన్న సిరిసిల్ల) ఎంపికయ్యారు. వీరు ఈ నెల 5న తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్‌లో ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

ఆశలు ‘సమాధి’

వాళ్లకు ఇద్దరు కూతుళ్లు.. అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు.. రెండు బంగారు వడ్డాణాలు.. రెండు జతల బంగారు గాజులు.. ఇద్దరికీ కమ్మలు, బుట్టాలు.. ఎవరినీ తక్కువగా చూడలేదు.. అంతేకాదు.. వివాహాలకు అవసరమైన ఆభరణాలూ సిద్ధం చేశారు.. పెళ్లి సంబంధాలు చూడడంలో నిమగ్నమయ్యారు.. అంతలోనే పెద్దకూతురు ప్రాణాలు కోల్పోవడం.. చిన్నకూతురు జైలుకు వెళ్లడం ఆ దంపతులకు తీరని వేదన మిగిల్చింది.. సొంత అక్కనే హత్యచేసిన చెల్లెలు అని పోలీసుల విచారణలో తేలడంతో వారి తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డి–మాధవి కన్నీరుమున్నీరవుతున్నారు.

- కూతుళ్ల వివాహ సన్నాహాల్లో తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి – మాధవి
- సంబంధాలు చూస్తుండగానే ఘటన
- హత్యకు గురైన పెద్దకూతురు
- కటకటాల పాలైన చిన్నకూతురు



శ్రీనివాస్‌రెడ్డి నివాసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు

కోరుట్ల: బంక శ్రీనివాస్‌రెడ్డి నెల్లూరు జిల్లా నుంచి సుమారు పాతికేళ్ల క్రితం ఉపాధి కోసం కోరుట్లకు వలస వచ్చారు. భార్య మాధవితో కలిసి చిన్నచితకా పనులు చేశారు. చివరకు ఇటుకబట్టీ వ్యాపారంలో స్థిరపడి మంచిపేరు తెచ్చుకున్నారు. ఈ దంపతులకు పెద్దకూతురు దీప్తి, చిన్నకూతురు చందన, కుమారుడు సాయి సంతానం. చిన్ననాటి నుంచి కూతుళ్లను అల్లారుముద్దుగా పెంచారు. ఇద్దరినీ బీటెక్ చదివించారు. నాలుగేళ్ల క్రితం దీప్తి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పుణేలోని ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. చందన ఇటీవల బీటెక్ పూర్తిచేసింది. కొడుకు సాయి బెంగళూర్‌లో డిగ్రీ చదువుతున్నాడు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం పాతికేళ్లుగా కష్టపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు.. పెళ్లీడుకొచ్చిన ఇద్దరు కూతుళ్లకు వివాహం చేయడానికి ఆర్నెల్లుగా మంచిసంబంధాలు చూస్తున్నారు.

పెళ్లిళ్ల కోసం స్థలాలు విక్రయించి..

- ఇటుకబట్టీ వ్యాపారంలో అంతోఇంతో సంపాదించిన శ్రీనివాస్‌రెడ్డి.. తాను కొనుగోలు చేసిన స్థలాలను ఇటీవల విక్రయించారు.
- ఇలా తన కూతుళ్లు దీప్తి, చందన వివాహాల కోసం డబ్బు, నగలు సమకూర్చుకున్నారు.
- సుమారు రూ.90 లక్షలు వెచ్చించి పెళ్లిళ్లకు అవసరమైన వడ్డాణాలు, చైన్‌లు, కమ్మలు, బుట్టాలు, హారాలు తయారు చేయించారు.
- వీటితోపాటు కొంత నగదు సిద్ధం చేసుకున్నారు.
- తన సొంతూరు నెల్లూరుకు వెళ్లి మంచి సంబంధాలు చూస్తున్నారు.
- కానీ, ఇంతలోనే దీప్తి హత్య ఆ కుటుంబాన్ని అతలాకుతలం చేసింది.

విశ్రాంతి తీసుకునే సమయంలో విషాదం..

కూతుళ్లకు వివాహం చేసి చరమాంకంలో విశ్రాంతి తీసుకుందామని యోచించిన శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు దీప్తి హత్య షాక్ ఇచ్చింది. పెద్దకూతురు హత్యకు గురికావడమే కాకుండా.. చంపింది చిన్న కూతురు చందన కావడం నివ్వెరపరిచింది. అంతేకాదు.. పెళ్లిళ్ల కోసం తాను సమకూర్చిన నగలు, నగదు తీసుకుని చందన ప్రియుడితో పరారైన వైనం శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు అశనిపాతంగా మారింది. ప్రస్తుతం దీప్తి హత్యకు గురికావడం, అక్కను హత్య చేసి జైలుపాలు కావడంతో శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇద్దరు కూతుళ్లు దూరం కావడంతో ఆ కుటుంబంలోనే కాదు.. పట్టణంలోనూ విషాదం నెలకొంది.

ఎన్టీపీసీ భూనిర్వాసితుల ఉద్యోగాల జాబితా విడుదల

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం భూనిర్వాసితుల ఉద్యోగాల జాబితాను ఎన్టీపీసీ యాజమాన్యం విడుదల చేసింది. గతేడాది ఏప్రిల్ 22న రాత పరీక్ష నిర్వహించింది. ఇందులో 247 మంది అర్హత పొంది.. 216 మంది రాత పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 25 మందిని ఎంపిక చేసి జాబితాను 2022 మే 12న సీనియర్ మేనేజర్ వేణుగోపాల్‌రావు విడుదల చేశారు. కోర్టులో ఫిర్యాదు, వివిధ కారణాలతో జాబితాను నిలిపివేశారు. హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్లు, ఫలితాలకు లోబడి 17 మందితో కూడిన జాబితాను విడుదల చేశారు. 8 మంది అభ్యర్థులకు సంబంధించి ఆధారాల ధ్రువీకరణ ప్రక్రియలో ఉన్నందున త్వరలో వెల్లడిస్తామని సంస్థ పేర్కొంది. 17 మందిని మెడికల్ పరీక్షకు పోస్టల్ ద్వారా అభ్యర్థులకు సమాచారం పంపించనున్నట్లు సమాచారం. జాబితాలో పల్లె వీరాంజనేయస్వామి, నగేష్‌కుమార్, చిర్రం పోచమల్లు, బాలసాని రాజేశం, బొద్దున రాజేశం, కారెంగుల శ్రీనివాస్, దాడి మురళి, సుధీర్‌కుమార్, మేకల అవినాశ్, జితేందర్‌రావు, రాజేశ్వరరావు, గోగిరెడ్డి నరేందర్ రెడ్డి, పెంద్రు రాజశేఖర్, ఎరవెల్లి శ్రీనివాసరావు, దమ్మాల శ్రీనివాస్, ఈదునూరి నరేశ్, డి.వెంకటస్వామి, దబ్బెట శ్రీనివాస్ ఉన్నారు.



ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు

పిడుగుపాటుకు మహిళాకూలీ మృతి



అప్పాల కొమురవ్వ మృతదేహం

చొప్పదండి: కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని కోనేరుపల్లిలో శనివారం మధ్యాహ్నం పిడుగు పాటుకు ఓ మహిళా కూలీ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం... పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కి చెందిన అప్పాల కొమురవ్వ (60) కూలీ పనిచేసుకొని బతుకుతోంది. శనివారం ఇతర కూలీలతో కలిసి ఆటోలో కరీంనగర్ జిల్లా కోనేరుపల్లి శివారులోని పత్తిచేనులో గడ్డి మొక్కలు తొలగించేందుకు వచ్చింది. మధ్యాహ్నం భోజనం చేసి మళ్లీ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడిక్కడే మృతిచెందింది. మరో మహిళకు తీవ్ర అస్వస్థతకు గురైంది. జిల్లా నుండి మరో జిల్లాకు కూలీ పనుల కోసం వచ్చి ప్రకృతి ప్రకోపానికి బలి కావడంతో తోటి కూలీల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


భవనంపైనుంచి పడి ఒకరి మృతి



శంకర్(ఫైల్)

మంథని: పట్టణంలోని శ్రీరామకాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి పోచమ్మవాడకు చెందిన ఎడ్ల శంకర్(50) మృతి చెందాడు. కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంటికి శంకర్ నీళ్లు పడుతున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు లిఫ్ట్ కోసం తీసిన గుంతలో పడిపోయాడు. తల, ఇతర శరీరభాగాల్లో బలమైన గాయాలు కావడంతో మేస్త్రీతోపాటు కుటుంబ సభ్యులు శంకర్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శంకర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. శంకర్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మృతుడి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

ప్రైవేట్ ఓబీలో ఇద్దరు కార్మికులకు గాయాలు



కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న సంజయ్



ఏరియా ఆసుపత్రిలో అశోక్ భట్ల

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధి ఓసీపీ–3లో ప్రైవేట్ ఓబీ పనులు నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్ కంపెనీలో వాహనం అదుపుతప్పి ఇద్దరి కార్మికులకు గాయాలయ్యాయి. క్యాంప్ ఆఫీస్ నుంచి వర్క్‌షాప్‌కు క్యాంపర్‌లో వెళ్తుండగా వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో వేగంగా వెళ్తున్న వాహనంపై ఇద్దరూ కిందకు దూకారు. ఈ ఘటనలో సంజయ్‌తడకే, అశోక్ భట్లకు గాయాలయ్యాయి. వీరికి గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సంజయ్ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తరలించారు. ఘటనపై సింగరేణి యాజమాన్యం విచారణ చేపట్టింది.

అంతర్ జిల్లా మోసగాళ్లు అరెస్ట్





నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, స్వాధీనం చేసుకున్న రికార్డులు, సెల్‌ఫోన్లు

- ప్రైవేట్ సొసైటీ పేరుతో మోసాలు
- ఐదు బ్రాంచ్‌లలో 1,600 మంది నుంచి రూ.3 కోట్లు వసూలు
- రియల్‌ఎస్టేట్, లిక్కర్, చిట్‌ఫండ్స్‌లలో పెట్టుబడులు
- రాజన్నసిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లో ఐదు కేసులు నమోదు
- రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: ప్రైవేట్ కంపెనీని ఏర్పాటు చేసి ప్రజల నుంచి భారీ ఎత్తున వసూలు చేసి మోసానికి పాల్పడ్డ ఇద్దరిని రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ణ శ్రీధర్, జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని చెగ్యాం గ్రామానికి చెందిన పోతరాజు లక్ష్మణ్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ణ శ్రీధర్ 2000 సంవత్సరంలో మంచిర్యాల జిల్లాలో ఉజ్వల థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటీవ్ సొసైటీ కంపెనీని స్థాపించారు. ఆరు నెలల వ్యవధిలోనే బెల్లంపల్లి, లక్సెట్టిపేట, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో సొసైటీలు స్థాపించారు. దాదాపు 1600 మంది వరకు ఖాతాలు తెరవడంతో రూ.3 కోట్ల వరకు సేకరించారు. శ్రీధర్ చైర్మన్‌గా, తన పూర్వ విద్యార్థి పోతరాజుల లక్ష్మణ్‌ను సీఈవోగా నియమించుకొని మరికొంత మంది సిబ్బందిని తీసుకున్నారు. ప్రజల నుంచి రికరింగ్ డిపాజిట్స్ ద్వారా డబ్బులు వసూలు చేశారు. ఆ డబ్బులను శ్రీధర్, లక్ష్మణ్ కలిసి మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్, లిక్కర్, చిట్ ఫండ్స్‌లలో పెట్టుబడి పెట్టారు. వివిధ స్కీమ్‌ల ద్వారా 150 మందికిపైగా సభ్యత్వం కల్పించి, సొసైటీలో ఖాతా తెరిచేందుకు రూ.650 వసూలు చేశారు. తమ సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే తక్కువ కాలంలోనే రెట్టింపు అవుతుందని నమ్మించారు. గత నెల 22న వేములవాడకు చెందిన బుస్స శ్రీనివాస్ మరికొందరు బాధితులు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈనెల 1న వ్యాపారం కోసం శ్రీధర్, లక్ష్మణ్‌లు కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా వేములవాడటౌన్ పోలీసులు నందికమాన్ వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కారు, సొసైటీకి సంబంధించిన కరపత్రాలు, పాస్ బుక్స్, అకౌంట్ ఓపెనింగ్, క్లోజింగ్ ఫామ్స్, లావాదేవీలకు సంబంధించిన రిజిష్టర్స్, మూడు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ప్రైవేట్ కంపెనీలు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడవద్దని, ఏదైన సమస్యలు ఉంటే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, పోలీసులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో ఒకరి మృతి

- అంత్యక్రియలు చేసిన కూతురు



అశోక్ (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన జునగరి అశోక్ (28) ఫిట్స్‌తో మృతి చెందాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యుల కథనం ప్రకారం అశోక్ కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. శుక్రవారం రాత్రి బయటకు వెళ్లి రాత్రి 9గంటలకు బయటకు వెళ్లిన ఆయన తిరిగిరాలేదు. భార్య మానస, కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెదుకుతుండగా.. పూసాల రోడ్డులో ఫిట్స్‌తో కొట్టుకుంటున్నాడని స్థానికుల నుంచి సమాచారం వచ్చింది. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కూతురు మహర్షిణి (5) అంత్యక్రియలు నిర్వహించడం కాలనీవాసులను కంటతడి పెట్టించింది.

కొట్టి చంపారని ప్రచారం..

ఇంటి నుంచి బయటకు వెళ్లిన అశోక్‌ను కొందరు తరిమివేశారని, ఆ సమయంలో కొట్టడంతోనే చనిపోయాడని స్థానికంగా ప్రచారం జరిగింది. అయితే అశోక్ ఒంటిపై గాయాలు లేకపోవడం.. పోస్టుమార్టం రిపోర్టులో అలాంటి ఆనవాళ్లు లేవని తేలడంతో ఫిట్స్‌తో మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. అశోక్ భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైన్‌షాప్ వద్ద ఇరువర్గాల దాడి

గోదావరిఖని: గోదావరిఖనిలోని రాజేష్ థియేటర్ సమీపంలోని వైన్‌షాప్ వద్ద ఇరువర్గాలు దాడి చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వైన్‌షాప్ పక్కనున్న పర్మిట్‌రూంలో మద్యం సేవిస్తున్న పైండ్ల సంజీవ్, భోగే సందీప్, ప్రేమ్‌కుమార్, చింత మణికంఠ, చింత శివకుమార్, బోహిని యశ్వంత్ రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో అందరూ గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

నిర్లక్షంతో ప్రమాదాలు జరిగితే ఉపేక్షించబోం

- వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి డైరెక్టర్ల హెచ్చరిక



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: అజాగ్రత్త, నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగితే ఉపేక్షించబోమని సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్‌వీకే.శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఉపరితల గనుల్లో జరుగుతున్న ప్రమాదాలకు తగిన కారణాలను విశ్లేషించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన రక్షణ చర్యలపై చర్చించారు. అలసత్వం, తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. పనితీరులో మార్పుతెచ్చుకోవాలని సూచించారు. లేకుంటే చర్యలుంటాయన్నారు. ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ, ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ విజయ్‌కుమార్, మేనేజర్ డి.రమేశ్, సేఫ్టీ అధికారి భరత్‌కుమార్, ఎంవీటీసీ మేనేజర్ శ్రీరంగారెడ్డి, ప్రైవేట్ ఓబీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు తప్పనిసరి

- ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: విద్యుత్ ప్రమాదాలు తగ్గించేందుకు కార్మిక వాడల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. శనివారం విద్యుత్ ఆదా, వినియోగంపై ముద్రించిన కరపత్రాలను అధికారులతో కలిసి విడుదల చేశారు. ఎర్తింగ్ సరిగాలేని క్వార్టర్ల ఉద్యోగులు సమాచారమిస్తే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రమాదాల నివారణకు క్వార్టర్లలో 30ఎంఏహెచ్ ఆర్‌సీబీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బట్టలు ఆరేసేందుకు ఇన్సులేషన్ ఉన్న వైరలను వాడుకుంటే మంచిదన్నారు. విద్యుత్ ఆదా కోసం వాటర్ హీటర్లు, మోటార్ల వాడకం పూర్తిగా నిషేధించామన్నారు. అవసరం లేని చోట్ల లైట్లు,ఫ్యాన్లు నిలిపివేయాలన్నారు. వకీల్‌పల్లిగని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఓటు జీఎం అబ్దుల్ సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీక్రిష్ణ, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్, సీనియర్ పీఓ మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలి

గోదావరిఖని: సంస్థ పరిధిలో ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు పటిష్టం చేయాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో విలేకరులతో మాట్లాడారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలన్నారు. రక్షణలో కూడిన ఉత్పతికి ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయించామన్నారు. పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

99శాతం బొగ్గు ఉత్పత్తి

ఆర్జీ–2 పరిధిలో ఆగస్టులో 99శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం వెల్లడించారు. 6.11లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి 6.08లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. వకీల్‌పల్లిగనిలో 119శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి ముందంజలో ఉందన్నారు.

మైనింగ్ సిబ్బందిని బాధ్యులను చేయొద్దు



మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో జరుగుతున్న ప్రమాదాలకు మైనింగ్ సిబ్బందిని బాధ్యులు చేసి వారిపై చర్యలు తీసుకోవడం సరికాదని సింగరేణి మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. నూతన సర్క్యులర్ ప్రకారం రిటైర్డ్, ప్రైవేట్ వ్యక్తులకు మైనింగ్‌లో ఉద్యోగాలు కల్పించడంపై మండిపడ్డారు. అనుభవం లేని ప్రైవేట్ వ్యక్తులతో సింగరేణిలో ఎక్కువశాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, సింగరేణి కార్మికుల పిల్లలు ఎంతోమంది మైనింగ్ డిప్లొమా చేసినవారు ఉన్నారని, వారితోపాటు కొత్తవారికి అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై ప్రజాపతినిధులు ఎమ్మెల్యే, మంత్రులు, సీఎం కేసీఆర్, కార్మిక సంఘాల నాయకులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాదాస్ రామ్మూర్తి, నాగెల్లి సాంబయ్య, అనిల్ కుమార్, రమణారెడ్డి, కిషన్‌రావు, ఎం.సాంబయ్య, మురళి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రామగుండం కార్పొరేషన్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ అభివృద్ధిలో ముందుందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని మూడో డివిజన్‌లో రూ.5 లక్షలతో అంబేద్కర్ భవనంలో అదనపు గదులు, రూ.10లక్షలతో పద్మశాలి సంఘ భవనం, మేడిపల్లిలో రూ.5లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రామగుండం అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి డివిజన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మేడిపల్లి గ్రామానికి పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. కార్పొరేటర్లు ఎన్వీ.రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి, బాలరాజ్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యులు రఫి, నాయకులు పాల్గొన్నారు.

హెల్త్‌సెంటర్ నిర్మాణానికి రూ.1.43కోట్లు

గోదావరిఖని: స్థానిక ఫైవింక్లయిన్ చౌరస్తా సమీపంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.1.43కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిధులు మంజూరు చేస్తూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రామగుండం: అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి–సోమనపల్లి మధ్య హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.2.35కోట్లు విడుదల కాగా శనివారం ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. ఎల్లంపల్లి, ముర్మూర్, టీటీఎస్ అంతర్గాంలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున కేటాయించారు. ఎల్లంపల్లి–గోలివాడ గ్రామాల మధ్య బీపీఎల్ రోడ్డుకు సీనరేజ్ నిధులు రూ.13 లక్షలు కేటాయించారు. అంతర్గాం ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, సర్పంచులు తదితరులున్నారు.



హమ్మయ్యా.. వర్షం కురిసింది



వారంరోజులుగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉక్కపోతకు కాస్త ఉపశమనం లభించింది. శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జిల్లాకేంద్రంలో సుమారు గంటపాటు ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి